

అనంత, నెల్లూరు జట్ల విజయం

కడపలో జరుగుతున్న ఏసీఏ అంతర్ జిల్లాల సీనియర్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో అనంతపురం, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. -10లో



గండిలో నేడు హనుమజ్జయంతి

గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో హనుమజ్జయంతి వేడుక శనివారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. -10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42.0/32.2

జిల్లాలో శుక్రవారం 32.2 - 42.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పది సప్లిమెంటరీ పరీక్షకు 394 మంది హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని 16 పరీక్ష కేంద్రాలలో నిర్వహించిన సోసియల్ పరీక్షకు 877 మంది విద్యార్థులకు 394 మంది విద్యార్థులు హాజరు కాగా 483 మంది గైర్హాజరయారు.రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలోని 6 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయి.విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు.

వెబ్ కౌన్సెలింగ్ తేదీల్లో మార్పులు

కడప ఎడ్యుకేషన్: పదోతరగతి పాస్, పాలిసెట్ అర్హత సాధించిన విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్ కోసం నిర్వహించే పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్ తేదీల్లో మార్పులు జరిగాయి. జూన్ 3వ తేదీ జరగాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన ఎన్నికల కౌటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందువల్ల జూన్ 6వ తేదీన జరుగుతుందని కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, పాలిసెట్ కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు. మే 31వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు ఉన్న వెబ్ అప్షన్ల తేదీలు కూడా మారినట్లు తెలిపారు. పాలిసెట్ ఆప్షన్లను జూన్ 7 నుంచి 10వ తేదీ వరకు నమోదు చేసుకోనవచ్చని చెప్పారు. ఎంపికైన కాలేజీల్లో విద్యార్థులు జూన్ 14 నుంచి 19వ తేదీలోగా రిపోర్టు చేసుకోవాలన్నారు. అయితే జూన్ 14వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పాలిసెట్ కో ఆర్డినేటర్ తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ కళాశాలల పునః ప్రారంభం




ఆర్ఐవో వెంకటసుబ్బయ్య

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ కళాశాలలు జూన్ 1వతేదీ శనివారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని ఆర్ఐవో, డీవీఈఓ(ఎఫ్ఏసీ) బండి వెంకటసుబ్బయ తెలిపారు.ఇంటర్‌కు సంబంధించి జిల్లాలోని అన్ని ప్రైవేట్, ప్రభుత్వ, సోసియల్ వెల్ఫేర్, మోడల్ కళాశాలలు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులను ప్రారంభించాలని ఆయన తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తనిఖీలు

కడప కోటిరెడ్డిసర్కిల్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక తనిఖీలను నిర్వహించనున్నట్లు కార్మికశాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్ నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన కార్మికశాఖ అధికారులతోపాటు డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాలు, వాణిజ్య సంస్థలు, హోటళ్లు, సినిమా థియేటర్లు, మెకానిక్ షాపులు, వెల్డింగ్‌షాపుల నిర్వాహకులు, యజమానులు బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. కార్మికశాఖ చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఆయా సంస్థల యాజమాన్యాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలులో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులతో డీఎం ఢిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రైవింగ్ స్కూలులో ఇస్తున్న శిక్షణకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తమ డ్రైవింగ్ స్కూలులో ఒక్కొక్క బ్యాచ్‌కు 16 మందికి మాత్రమే శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణలో భాగంగా 30 సంవత్సరాల అనుభవం గల ఇన్‌స్ట్రక్టర్లు ప్రాక్టికల్, థియరీ క్లాసులు నిర్వహిస్తారన్నారు. ప్రతిరోజు గంట పాటు వాహన విడిభాగాలు, వాటి పనితీరు గురించి తెలియజేస్తారని, రోడ్లపైన ఉండే పెయింటింగ్ మార్కుల గురించి, సిగ్నల్ బోర్డుల గురించి వివరిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరి చేత 15 కిలోమీటర్లు బస్సును నడపడం, వీడియో విజువల్స్ ద్వారా ప్రమాదాల తీరు తెలియజేసి వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి తెలియజేస్తారన్నారు. డ్రైవింగ్ పట్ల ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 99592 25774, 73828 65145 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మనబడికి రండి



నాడు నేడుతో సర్వాంగ సుందరంగా మారిన కడప భగత్‌సింగ్‌నగర్‌లోని ఎంపీపీ స్కూల్

- తల్లితండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు
- అందరూ చదువుకునేందుకు ప్రభుత్వం చర్యలు
- ఇంటింటి ప్రచారంతో సత్ఫలితాలు

కడప ఎడ్యుకేషన్: పేదింటి ప్రతి విద్యార్థి చదువుకోవాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. ఆ లక్ష్యంతోనే పిల్లలను బడికి పంపితే చాలు ప్రభుత్వమే వారి చదువుకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలను ఉచితంగా అందిస్తోంది. దీంతోపాటు ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అధునికీకరించి ఆయా ప్రైవేటు పాఠశాలల్లో చదివే పిల్లలతో పోటీ పడేలా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమం, సీబీఎస్ఈ సిలబస్‌ని కూడా అమలు చేయనున్నారు. ఈ ఏడాది కూడా పాఠశాలలు పునః ప్రారంభం రోజునే పిల్లలందరికీ విద్యాకానుకను అందించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇదంతా పిల్లలను ప్రభుత్వ బడికి పంపితే కలిగే ప్రయోజనాలు, ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలపై ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహణకు శ్రీకారం చుట్టారు. తమ పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో సాధించిన ఫలితాలను, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించడంతో పాటు పిల్లల చదువుకు కావాల్సిన అన్ని రకాల వస్తువులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలియజేస్తున్నారు. కొంతమంది ప్రధానోపాధ్యాయులు ప్రైవేటు పాఠశాలల తరహాలో ఈ ఏడాది పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల ఫొటోలతో కరపత్రాలను ముద్రించి తల్లిదండ్రులకు అందచేస్తూ ప్రచారం సాగిస్తున్నారు.

- పిల్లలకు రోజుకో మెనూతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. అలాగే చిక్కీలు, రాగి జావలను కూడా ఇస్తున్నారు. దీంతోపాటు పిల్లలను బడికి పంపే తల్లుల ఖాతాలో ఏడాదికి రూ.15 వేలు నగదు జమకానుందని తెలియజేస్తున్నారు. పైసా ఖర్చు లేకుండా సొంత ఊరి బడిలోనే పిల్లలకు ఉత్తమ విద్యను పొందవచ్చని చెబుతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు స్మార్ట్‌టీవీలతో బోధన, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను ఉచితంగా ఇస్తున్నారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా బోధన అందుతుందని పిల్లల తల్లితండ్రులకు వివరిస్తున్నారు.

పది అంశాల గురించి వివరిస్తూ...

'మనబడి'కి రండి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రచారం సాగిస్తున్నారు. ఉపాధ్యాయులు ముఖ్యంగా పది అంశాల గురించి పిల్లల తల్లిదండ్రులకు తెలియచేస్తున్నారు. నాడు- నేడు పథకం ద్వారా పాఠశాలలు ఎలా తయారయ్యాయో తెలియజేస్తున్నారు. అలాగే ఆంగ్లమాధ్యమం అందుబాటులో ఉందని, నూతన విద్యా విధానం ద్వారా పిల్లలకు ఒత్తిడిలేని బోధన ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్స్ ఉంటారని, పిల్లల చదువుకు కావాల్సిన అన్ని రకాల వస్తువులను విద్యాకానుక పేరుతో ఉచితంగా అందజేస్తారని వివరిస్తున్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

విద్యాకానుకలో పిల్లలకు అవసరమైన యూనిఫాం, బూట్లు, సాక్సులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగులు ఇస్తారని చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తే తల్లిదండ్రులకు భారం ఉండదని చెబుతూ ప్రచారం సాగిస్తున్నారు.

హైస్కూల్ ప్లస్ బడుల గురించి ప్రచారం..

గ్రామీణ ప్రాంతాల్లో పదోతరగతి తర్వాత తమ పిల్లలను ఇంటర్‌లో చేర్పించడానికి చాలామంది వెనుకంజ వేస్తున్నారు. దీనివల్ల చాలామంది బడికి దూరమవుతూ డ్రాపౌట్స్‌గా మారుతున్నారు. దీనిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఉన్న ఊరిలోని ఉన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి హైస్కూల్ ప్లస్‌గా మారుస్తోంది.ఇందులో భాగంగా 2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని 20 ఉన్నత పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా మార్చింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో డ్రాపౌట్స్ సంఖ్య తగ్గనుంది. హైస్కూల్ ప్లస్ గురించి కూడా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.



అన్ని వసతులతో తరగతి గది

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య



ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతోపాటు ఉన్నత విలువలు, సంస్కారం, సంప్రదాయాల గురించి కూడా నేర్పుతున్నారు. ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తున్నారు. దీంతో కార్పొరేట్‌కు దీటుగా ఫలితాలు కూడా వస్తున్నాయి. తల్లితండ్రులు ఆలోచించి రూపాయి ఖర్చు లేకుండా అన్ని వసతులు కల్పించే ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలి

– మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

డీసీఎంఎస్‌లో అక్రమాలపై విచారణ

కడప అగ్రికల్చర్: కడప డీసీఎంఎస్ కార్యాలయ పరిధిలోని స్థల లీజులు, కార్యాలయ లిఫ్ట్ ఏర్పాటుతోపాటు కొంతమంది సిబ్బంది నియామకంపై అక్రమాలు చోటు చేసుకున్నాయని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందినట్లు తెలిసింది. ఈ మేరకు ఆయన విచారణకు ఆదేశించారు. దీంతో పొద్దుటూరు డివిజనల్ లెవెల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్(డీఎల్‌సీఓ) సురేష్‌కుమార్ కడప డీసీఎంఎస్ కార్యాలయంలో శుక్రవారం విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా కార్యాలయంలో సిబ్బందితో పాటు పాలక వర్గానికి చెందిన చైర్ పర్సన్ దండు చంద్రలీల, డైరెక్టర్లు సుదర్శన్‌రెడ్డి, శంకర్, శిరోమణిలను ఆయన విచారించారు. ని వేదికలను ఉన్నతాధికారులకు సమర్పించనున్న ట్లు తెలిసింది. ఈ విషయం గురించి సురేస్‌కుమార్‌తో మాట్లాడగా సిబ్బందితోపాటు పాలక వర్గానికి చెందిన వారిని విచారించామని తెలిపారు.

ప్రశాంతంగా పాలిసెట్ కౌన్సెలింగ్



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. 59001 నుంచి 75 వేల మధ్య ర్యాంకులు వచ్చిన 138 మంది విద్యార్థులు హాజరై తమకు సంబంధించిన ర్యాంకులు, సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారని పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. శనివారం 75001 నుంచి 92000 వరకు ర్యాంకులు పొందిన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు, ర్యాంకులను పరిశీలన చేయనున్నట్లు సీహెచ్ జ్యోతి తెలిపారు.

విత్తన కాయల నాణ్యతలో రాజీ వద్దు



రైతులతో కలసి వేరుశనగ విత్తన కాయలను పరిశీలిస్తున్న చంద్రానాయక్

రాయచోటి టౌన్: ప్రభుత్వం అందించే సబ్సిడి వేరుశనగ విత్తన కాయలు నాణ్యత లోపిస్తే వెంటనే వెనక్కు పంపాలని అన్నమయ్య జిల్లా డీఏవో చంద్రానాయక్ రైతు భరోసా కేంద్రాలలో విధులు నిర్వర్తించే వ్యవసాయ సహాయకులకు సూచించారు. మే 29వ తేది నుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు వేరుశనగ కాయలు సబ్సిడీ ధరలకు అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన శుక్రవారం అన్నమయ్య జిల్లా రాయచోటి రూరల్ పరిధిలోని దిగవ అబ్బవరం గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కె-6 రకం వేరుశనగ కాయలు 35323 క్వింటాళ్లు, నారాయణి రకం వేరుశనగకాయల 18046 క్వింటాళ్లు. టీసీజీఎస్ రకం వేరుశనగ కాయలు 900 క్వింటాళ్లు, కదిరి లేపాక్షి వేరుశనగ కాయల రకం1114 క్వింటాళ్లు సబ్సిడితో అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అన్ని రైతు భరోసా కేంద్రాలకు డిమాండ్ ఆధారంగా నిల్వ ఉంచామని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు కోరిన విత్తన కాయలు అందిస్తామని చెప్పారు. విత్తన కాయలు తీసుకెళ్లిన రైతు తప్పకుండా సాగు చేయాలన్నారు. విత్తనాలు సాగు చేయకపోతే ఆ రైతు విత్తనం పూర్తి ధర చెల్లించాలని హెచ్చరించారు.విత్తన కాయలు పంపిణీ చేసే సమయంలో అధికారులు విత్తన స్టాక్ రిజిస్టర్, క్వాలిటీ అసిస్మెంట్ రిజిస్టర్, సీడ్ డిలవరీ చలానా, సీడ్ జర్మినేషన్, వేరుశనగ కాయల ధరల పట్టిక సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు.

లక్కిరెడ్డిపల్లి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు నాణ్యతమైన వేరుశనగ విత్తన కాయలను రైతులకు అందజేస్తున్నామని అన్నమయ్య జిల్లా జేడీ చంద్రనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అనంతపురం, చౌటుపల్లి రైతు భరోసా కేంద్రాలను ఆయన పరిశీలించి రైతులకు విత్తన కాయలను పంపిణీ చేశారు.

మూడు రోజులు మద్యం అమ్మకాలు బంద్

రాయచోటి(జగదాంబ సెంటర్): కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల లెక్కింపు సందర్భంగా జూన్ నెల 3, 4, 5వ తేదీలలో మద్యం అమ్మకాలపై నిషేధం విధిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హోటళ్లు, లాడ్జీలలో తనిఖీలు నిర్వహించి అనుమానితులను అదుపులోకి తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

వంటింట.. కూరగాయాలు

మార్కెట్లో మండిపోతున్న కూరగాయల ధరలు



రాయచోటి/గుర్రంకొండ: సామాన్యుడు మార్కెట్లోకి అడుగుపెట్టాలంటే హడలెత్తిపోతున్నాడు. ఓవైపు కూరగాయాల ధరలు మండిపోతుంగా మరోవైపు పప్పుదినుసుల ధరలు భగ్గుమంటున్నాయి. దీంతో జేబుకు చిల్లులు పడుతున్నాయి. కూరగాయల సాగు పడిపోవడంతో రెండు నెలల కింద సాధారణంగా ఉన్న ధరలు నేడు నాలుగురెట్లు అధికమయ్యాయి. అన్నమయ్య జిల్లాలో అధికంగా సాగయ్యే టమాటా కిలో రూ.30 నుంచి రూ.60 పలుకుతోంది. మిరప రూ.120కి చేరగా, చిక్కుడు కిలో ధర వంద రూపాయలకు చేరింది. బీన్స్ కిలో రూ.150కు పెరిగింది. కొన్ని కూరగాయల ధరలు సెంచరీ దాటాయి. అన్నమయ్య జిల్లాలోని రైతుబజార్లు, మార్కెట్లలో కూరగాయలు కొనడానికి వచ్చిన సామాన్య, మధ్యతరగతి ప్రజలు ధరలు చూసి బెంబేలెత్తుతున్నారు. కిలోల చొప్పున కొనేవారు పావుకిలో, అరకిలోతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

- టమాటా మొదటి రకం కిలో రూ.50లకు విక్రయిస్తుండగా షాపింగ్ మాల్స్‌లో రూ.60 ఉంటోంది. మార్కెట్‌లో కిలో పచ్చిమిర్చి రూ.100లకు విక్రయిస్తున్నారు. బీట్‌రూట్ కిలో ధర రూ.40 నుంచి రూ.59 దాకా పెరిగింది. ఆలుగడ్డ కూడా రూ.30 నుంచి రూ.50 దాకా పెరిగింది. గతంలో చవకగా లభించిన క్యాప్సికం కిలో ధర రూ.55 నుంచి రూ.76కు, క్యాబేజీ కిలో రూ.30 నుంచి రూ.54, క్యాలీఫ్లవర్ రూ.31 నుంచి రూ.45కు చేరింది. క్యారెట్ కిలో ధరల రూ.41 నుంచి రూ.68కు పెరిగింది. రూ.20లకు లభించే కొబ్బరికాయల ధర రూ.40లకు పెరిగింది. కొత్తిమీర, కరివేపాకు నుంచి గోంగూర, పాలకూ, తోటకూర, కోయ తోటకూర దాకా అన్ని ఆకు కూరలు ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. వంకాయ కిలో రూ.80లకు చేరింది. రూ.10లకు 10 లభించే నిమ్మకాయలకు ప్రస్తుతం రూ.40 వెచ్చించాల్సి వస్తోంది. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, రాయచోటి, రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో కూరగాయలు పండిస్తారు. అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతినడంతో కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి వీటిని రవాణా చేసుకోవాల్సి వస్తోంది. దీనివల్ల కూడా ధరలు పెరిగాయి. జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి కూరగాయలు మరో నెల రోజుల దాకా తక్కువగానే వస్తాయని రైతు రామసుబ్బారెడ్డి చెప్పారు. కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతు న్నాయని, కొనేటట్టు లేవని గాలివీడుకు చెందిన రజిత అనే గృహిణి చెప్పారు. ఈ వేసవిలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయలు తగ్గాయని రాయచోటి మార్కెట్ వ్యాపారి జాకీర్ తెలిపారు. ఢిల్లీ, ఇండోర్ నుంచి ఆలుగడ్డలు, రాంచీ నుంచి బీన్స్ వస్తున్నాయని, దూరాభారం నుంచి కూరగాయలు తెప్పించుకోవాల్సి రావడం, రవాణా ఖర్చుల భారం వల్ల ధరలు పెరిగాయని కూరగాయల మార్కెట్ కమిషన్ ఏజెంట్ కొత్తిమీర ప్రసాద్ చెప్పారు.

కూరగాయల రకాలు	ధరలు(కిలో)
పచ్చిమిర్చి	రూ.100
టమాటాలు	రూ.60
బీన్స్	రూ.150
ఉల్లగడ్డలు	రూ.50
మునగ	రూ.60
వంకాయ	రూ.80
క్యారెట్	రూ.60
ఉల్లిపాయలు	రూ.40
వెల్లుల్లిపాయలు	రూ.200
కాకర	రూ.70
బెండకాయలు	రూ.60
మొటిక్కాయలు	రూ.50
ముల్లంగి	రూ.50
బీరకాయలు	రూ.40
ఆకుకూరలు	రూ.30

రారెత్తిస్తున్న ఎండలు



- మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- 42 డిగ్రీలు నమోదు
- ఉక్కపోతతో అల్లాడుతున్న జనం

కడప అగ్రికల్చర్: వేసవికాలం ఆరంభమై దాదాపు మూడు నెలలైంది. ఈ ఏడాది జిల్లాలో ఎండలు అదరకొట్టాయి. ఏప్రిల్ నెలలో 40 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మే నెల ప్రారంభం నుంచే 44 డిగ్రీల నుంచి 46.2 డిగ్రీల వరకు నమోదయ్యాయి. దీంతో జనాలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఎండలతో వృద్ధులు, చిన్నారులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. జిల్లాలో చాలా మంది వడదెబ్బతో మృత్యువాత పడ్డారు. ఈ తరుణంలోనే మే నెల రెండోవారంలో ఉపరితల ఆవర్తనం కారణంగా 8వ తేదీన జిల్లాలో భారీ వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. జిల్లా ప్రజలు ఎండల నుంచి కాసింత ఉపశమనం పొందారు. అయితే రెండు మూడు రోజుల నుంచి పగటి ఉష్ణోగ్రతలతోపాటు రాత్రి ఉష్ణోగ్రతలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో జనాలు ఉక్కపోతతో అల్లాడి పోతున్నారు. ఉదయం 12 గంటలకల్లా ఇళ్లకు చేరిపోతున్నారు.జిల్లాలో వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతూ వస్తున్నాయి. గత నెల 26వ తేదీ ఆదివారం 38.2 డిగ్రీల ఉష్ణాగ్రత నమోదు కాగా 27 తేదీ 35.2, 28వ తేదీ 38.2 , 29వ తేదీ 39.2, 30వ తేదీ 41.6, 31వ తేదీ 42.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గాలిలో కూడా తేమశాతం తగ్గడంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.



మధ్యాహ్నం సమయంలో నిర్మానుష్యంగా మారిన కడప అంబేడ్కర్ సర్కిల్ రోడ్డు

మళ్లీ పెరిగిన విద్యుత్తు వినియోగం



జిల్లాలో ఎండల తీవ్రతతో విద్యుత్తు వినియోగం కూడా పెరిగింది.ఉక్కపోత వల్ల 24 గంటలూ ఫ్యాన్లు తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. బయట తిరిగే ప్రజలు ఎండ నుంచి తప్పించుకునేందుకు మళ్లీ టోపీలను, చిన్నపాటి గొడుగులను కొనుగోలు చేస్తున్నారు.


మూడు, నాలుగు రోజుల్లో రుతుపవనాలు..

రుతు పవనాలు ఇప్పటికే కేరళను తాకాయి. మరో మూడు నాలుగు రోజుల్లో రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ పేర్కొంది. వర్షాలు కురుస్తాయని తెలిపింది. దీంతోపాటు జూన్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభంకానుంది. ఇప్పటికే రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయ అధికారులు పంపిణీ చేశారు. ఇక వర్షాలు పడితే రైతన్నలు సాగుకు సమాయత్తం కానున్నారు.

మే నెలలో తేదీల వారీగా ఉష్ణోగ్రతలు..

తేదీ	2023	2024
26	36.2	38.2
27	37.0	35.2
28	38.3	38.2
29	38.0	39.2
30	38.7	41.6
31	38.7	42.0

జాగ్రత్తలు పాటించాలి....



జిల్లాలో మళ్లీ ఎండల తీవ్రత పెరుగుతోంది. విద్యార్థులు, ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. అడుకునేందుకు మైదానాలకు వెళ్లే పిల్లలు ఉదయం 11 గంటలకల్లా ఇళ్లకు చేరుకోవాలి. సాయంత్రం ఎండలు తగ్గిన తర్వాతే బయటకు వెళ్లాలి. మరో వారం పది రోజుల్లో ఎండల తీవ్రత తగ్గే అవకాశం ఉంది. అంత వరకు పిల్లలు, పెద్దలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండల తీవ్రతను తట్టుకునేందుకు ఓఆర్ఎస్ ద్రావణం, టెంకాయిలు, మజ్జిగ వంటివి తాగుతూ ఉండాలి.

– డాక్టర్ కొటకొండ మనోహర్, జనరల్ ఫిజీషియన్, రిమ్స్

క్లుప్తంగా

కమలాపురం దర్గా సందర్శన



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న కాటసాని

కమలాపురం : కర్నూలు జిల్లా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు కమలాపురంలోని దర్గా-ఎ-గఫారియా, జహీరియాను శుక్రవారం దర్శించుకున్నారు. కాటసాని తన కుటుంబ సభ్యులతో కలిసి దర్గా పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షాఖాద్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం స్వామివారి మజార్ల వద్దకు వెళ్లి పూల చాదర్ సమర్పించి ప్రత్యేక ఫాతెహ నిర్వహించారు. పీఠాధిపతి కుటుంబ సభ్యులు కాటసాని దంపతులను సన్మానించారు. దర్గా కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ దర్గా విశిష్టత, స్వామి చరిత్రను కాటసానికి వివరించారు. కాటసాని మాట్లాడుతూ దర్గాను దర్శించు కోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండలం గండికోట కొట్టాల గ్రామానికి చెందిన మల్లే మహీంద్ర(32) గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శరీరంపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఏఎస్‌ఐ మురళీ మోహన్ వివరాల మేరకు.. గండికోట కొట్టాల గ్రామానికి చెందిన మల్లే మహీంద్ర స్థానిక గాలిమరల కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడికి భార్య వరలక్ష్మీ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఐదేళ్ల కిందట కుమారుడు చనిపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. గురు వారం ఇంట్లో ఎవరూలేని సమయంలో శరీరంపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. స్థానికులు, బంధువులు 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించారు. భార్య వరలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రేపటి నుంచి నల్లగంగమ్మ తిరుణాల

కేవీపల్లె : మండలంలోని మిన్నంరెడ్డిగారిపల్లెలో నల్లగంగమ్మ తిరుణాల ఆదివారం నుంచి నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించనున్నారు. రాత్రి చాందినీ బండ్లతో భక్తులు ఆలయ ప్రదక్షిణ చేస్తారని, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సోమవారం ఉదయం అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

అన్నదాతకు.. వెన్ను దన్నుగా కియోస్క్

- రైతులకు సమాచార కోసం ప్రత్యేక యాప్
- ఎరువులు, మందులు బుక్ చేసుకునే అవకాశం
- తొమ్మిది రకాల సేవలందిస్తున్న యంత్రం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అడుగడుగునా అన్నదాతకు అండగా నిలిచింది. గ్రామ స్థాయిలోనే రైతన్నకు సేవలందించాలనే సంకల్పంతో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. భూసార పరీక్షల నుంచి పంట దిగుబడి విక్రయించే వరకు అన్ని రకాల సేవలను అందుబాటులోకి తెచ్చింది. రైతులు విత్తనాలు, ఎరువులు పొందేందుకు పేర్లు నమోదు చేసుకునేలా కియోస్క్ యంత్రాలను ఏర్పాటుచేసింది.



కియోస్క్ యాప్‌పై అవగాహన ఇస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది



రైతు భరోసా కేంద్రంలో కియోస్క్ యంత్రం

ఎర్రగుంట్ల : జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎన్నో సేవలందిస్తున్నాయి. ఎరువులు, పురుగుమందులు, విత్తన కాయల పంపిణీకి కేంద్రాలుగా మారాయి. ఇందుకోసం ప్రతి ఆర్బీకేలోనూ కియోస్క్ యంత్రాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. మొబైల్‌లోనూ వాడే సామర్థ్యం ఉన్న ఈ యాప్ ద్వారా 9 రకాల ప్రయోజనాలు రైతులు పొందవచ్చు. గ్రామ స్థాయిలో అన్ని రకాల సేవలు లభించడంతో రైతుల నుంచి ఆనందం వ్యక్తమవుతోంది. కొనుగోలు కేంద్రాల్లో పంట నాణ్యతా ప్రమాణాలు, వాతావరణం, మార్కెట్ ధరలు, మద్దతు ధర ఇలా అన్ని అంశాలను అందుబాటులోకి తెచ్చినట్లు మండల వ్యవసాయ అధికారులు తెలిపారు.

కనీస మద్దతు ధర..

ఆర్బీకే పరిధిలో ముఖ్య పంటలకు కనీస మద్దతు ధర తెలుసుకొనే వీలుంది. వరి, మొక్కజొన్న, వేరుశనగ, వాణిజ్య పంటలు రైతు నష్టపోకుండా అనుకూలమైన ధరకు అమ్ముకునేందుకు కియోస్క్ యాప్ ఉపయోగపడుతుంది.

రైతు సమాచారం...

రైతులకు సంబంధించి వ్యవసాయ వార్తలను కియోస్క్ ద్వారా తెలుసుకోవచ్చు. వైఎస్సార్ రైతు భరోసా, సాగుకు భరోసా, ప్రకృతి వ్యవసాయం సాగు చేసే విధానం, మూగ జీవాలకు అంబులెన్స్, ఆర్బీకేల ద్వారా పంటల కొనుగోలు వంటి వార్త సంబంధిత విషయాలు తెలుసుకోవచ్చు.

ప్రయోగశాల సమాచారం..

ఆర్బీకే పరిధిలోని రైతులకు డాక్టర్ వైఎస్సార్ సమీకృత వ్యవసాయ ప్రయోగశాలల సమాచారం అందుబాటులో ఉంచారు. తద్వారా ఏ భూమిలో ఏ పంట వేయాలి? దానికి సంబంధించిన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, పశువులకు, వచ్చిన రోగాలకు సంబంధించి అన్ని ప్రయోగాలు తెలుసుకునేందుకు వీలుంది.

కొనుగోలు కేంద్రాలు..

గతంలో రైతులు పండించిన పంటకు కొనుగోలు కేంద్రాలు ఎక్కడో తెలియక దళారులను ఆశ్రయించేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేకుండా కియోస్క్ ద్వారా దగ్గరలోని కొనుగోలు కేంద్రాల్లో విలువైన సమాచారం అందుతోంది. ఇది రైతులకు లాభదాయకంగా ఉంటుంది.

వాతావరణం

ఈ యంత్రం ద్వారా వాతావరణంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంది. ఆర్బీకే పరిధిలో కనిష్ట, గరిష్ట, ఉష్ణోగ్రతలు, వర్షపాతం వివరాలు తెలియజేస్తుంది. దానికి అనుగుణంగా రైతులు ఏ విధమైన చర్యలు చేపట్టవచ్చో సులభంగా తెలుసుకోవచ్చు.

రైతులకు ఎంతో ఉపయోగం..



ఆర్బీకేల్లో కియోస్క్ ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం. యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. దీని ద్వారా తొమ్మిది రకాల ప్రయోజనాలు చేకూరుతున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికాభివృద్ధి చెందవచ్చు. గ్రామస్థాయిలో అన్ని రకాల సేవలు లభించడంతో రైతు ఆనందంగా ఉన్నారు.

– శ్రీకాంత్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, యర్రగుంట్ల

ఆన్‌లైన్‌లో రూ.1.29 లక్షల చోరీ

మదనపల్లె : ఆన్‌లైన్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఖాతా నుంచి రూ.1.29 లక్షలు కాజేసిన వైనం మదనపల్లె పట్టణంలో శుక్రవారం జరిగింది. మదనపల్లి టూటౌన్ పోలీసులు, సైబర్ క్రైమ్ సిబ్బంది వివరాల మేరకు.. మదనపల్లె పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బద్రీనాథ్ తన స్మార్ట్ ఫోన్‌లో ఆన్‌లైన్ ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఇందుకు క్రెడ్ యాప్‌ను ఉపయోగిస్తున్నాడు. గురువారం సాయంత్రం తన ఖాతా నుంచి రూ.2 లక్షలు డ్రా చేసినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ రావడంతో అవాక్కయ్యాడు. తన అకౌంట్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి నగదు చోరీ చేశారని గుర్తించి, క్రెడ్ యాప్‌లో ఫిర్యాదు చేశాడు. వారు వెంటనే స్పందించడంతో రూ.70వేలు రికవరీ చేయగలిగారు. మిగిలిన రూ.1,29,495, రూపాయలు సైబర్ నేరగాళ్లు తీసుకున్నారు. బాధితుడు శుక్రవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్, సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేశాడు.

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన రామాజుల

పీలేరురూరల్ : కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రేగళ్లలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రేగళ్ల కస్పాకు చెందిన పూజా రాజ భార్య రామాంజుల(37) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. శుక్ర వారం కడుపునొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫంకాకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలికి కుమార్తె ఆవేక వుంది.

గండిలో హనుమజ్జయంతి వేడుక





గండిలో హోమాలు నిర్వహిస్తున్న పురోహితులు, ప్రత్యేక అలంకరణలో గండి వీరాంజనేయుడు

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో హనుమజ్జయంతి వేడుక శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ, పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో అర్చకులు బుధవారం నుంచి హోమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. శుక్రవారం మూల విరాట్‌ను పుష్పాలతో అలంకరించి త్రికాల ఆరాధన, చతుస్థానార్చన, మన్యుసూక్త హోమం, మూలమంత్ర హోమం, స్నపన తిరుమంజనం, లఘుపూర్ణాహుతి, గోష్ఠి తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమాలు జరిపారు. శనివారం ప్రత్యేక పూజలతోపాటు చక్రాయపేట వేంకటేశ్వర రాచరాయ స్వామి ఆలయం ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర(మోటార్ సైకిల్ ర్యాలీ)గండి నుంచే ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదపారాయణదారు రామ్మోహన్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

అనంత, నెల్లూరు జట్ల విజయం

సెంచరీలు సాధించిన వంశీకృష్ణ, ఖాద్రి



ఫర్హద్‌ఖాద్రి(102పరుగులు)



టి.వంశీకృష్ణ(100 పరుగులు)



అర్జున్‌టెండూల్కర్(61పరుగులు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో జరిగే ఏసీఏ అంతర్ జిల్లాల సీనియర్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో అనంతపురం, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 47.4 ఓవర్లలో 289 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని పి.అర్జున్ టెండూల్కర్ 34 బంతుల్లో 7ఫోర్లు, 4 సిక్సర్‌లతో 61 పరుగులు, బి.వినయ్‌కుమార్ 51 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 52 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు రెడ్డి ప్రకాష్ 4, వర్షిత్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 32.3 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని ధరణినాయుడు 26 పరుగులు చేశారు. అనంత బౌలర్లు దీపన్ సాయి 2 వికెట్లు తీశాడు. దీంతో అనంతపురం జట్టు 143 పరుగుల భారీ ఆధిక్యంతో విజయం సాధించింది.

కడప జట్టుపై నెల్లూరు విజయం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 46.1 ఓవర్లలో కడప జట్టు 229 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని టి.వంశీకృష్ణ 128 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్సర్‌తో 100 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. నెల్లూరు బౌలర్లు భరత్ 4, అఖిల్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 36.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 230 పరుగులు చేసింది. జట్టులోని ఫర్హద్ ఖాద్రి 94 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్సర్‌లతో 102 పరుగులతో నాటౌట్‌గా రాణించాడు. ఈయనకు జతగా నిఖిలేష్ 56 పరుగులు చేశాడు. కడప బౌలర్ మహ్మద్ రఫీ 2 వికెట్లు తీశాడు. కాగా నెల్లూరు జట్టు 8 వికెట్ల ఆధిక్యంతో ఘనవిజయం సాధించింది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ ADMISSION GUIDANCE : B.Tech@ SRM / VIT / AMRITHA / MSR / RV / PES / BVSC@ RAJASTHAN / HARYANA For 30 Lak. Cont: ✆ : 99022 64488

B.TECH. అడ్మిషన్స్
■ AP EAPCET ర్యాంకు రానివారికి డైరెక్ట్ గా B.Tech. (Any Branch) లో ఫ్రీ ఎడ్యుకేషన్ కలదు. Only హాస్టల్ ఫీజు కట్టుకోవలెను. Cont : G. Murali, 9030661651.

REAL ESTATE
HOUSE FOR SALE
■ మదనపల్లి ప్రశాంత్ నగర్ 7th క్రాస్ నందు D.No.3-145-9-6, తూర్పుముఖం గల 43 1/2 x 41 1/2 గల ఇల్లు అమ్మబడును.నో బ్రోకర్స్. సంప్ర: 9966770455.

TO-LET
■ కడప నగరంలోని సింగపూర్ సిటిలో రోడ్ నెంబర్ 7 నందు ఇల్లు బాడుగకు కలదు. సంప్రదించాల్సిన నంబర్ : 8331951098

SERIVCES
BUSINESS OFFER
■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టీచ్‌వర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9253560455.

CHANGE OF NAME
■ I, Pulla Salam S/o Poola Kamal Uddin (Old Name) R/o 4-144, Sarvarkhan Pet, Khajpet-516203, A.P. here by change my name to Poola Abdul Salam (New Name) for all purpose
■ I, Shaik Shaista Banu W/o Shaik Habibullah (Old Name) R/o 11/28, Ameen Peer Road, Kadapa - 516001, A.P. here by change my name to Shaik Shaistha Banu (New Name) For all purposes
■ I, Pulla Ameer Basha S/o Pulla Salam (Old Name) R/o 4-144, Sarvarkhan Pet, Khajpet-516203, A.P. here by change my name to Poola Ameer Basha (New Name) For all purposes

WANTED
■ Wanted Teachers for Primary and high school all subjects. Pets, Music and dance Teachers at Thollagan gannapalli and Kamalapuram Branch. Cont: 7575920915

■ వెంటనే కావలెను... రిసెప్షనిస్ట్ (కంప్యూటర్ నాలెడ్జ్ ఉండవలెను) సర్వీస్ బాయ్స్ Infiniti Cafe నందు పనిచేయుటకు కావలెను. Opp. సాక్షి ఆఫీస్ పులివెందుల రోడ్, కడప సంప్ర: 9182243374
■ వల్లా హాస్పిటల్, 7 రోడ్ సర్కిల్ నందు పనిచేయుటకు, ఫార్మసిస్ట్, రిసెప్షనిస్ట్, (కంప్యూటర్ నాలెడ్జ్ ఉండవలెను) మరియు వార్డ్ బాయ్ కావలెను. సంప్ర: 9849040153
■ మీకు కారు ఉందా? ఇంట్లో ఖాళీగా పార్క్ చేసిన ఉందా? ఇప్పుడు మీ కడపలో మీ కారుని జోడించి, నెలకు రూ.32000/- వరకు సంపాదించండు ప్రారంభించండి మరింత సమాచారం కోసం 6301174585 కు కాల్ చేయండి.
■ Wanted Qualified teachers in Montfort School, Walk in interview on 5, 6, 7 June 2024 9.00am to 1 pm. Teachers for : Pre Primary LKG & UKG, Primary/HS : Hindi, Primary Social, Science Come along with your resume Phone : 7995351591
■ త్రివేణి హోమ్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ 18K. ఫోన్: 9160900024 / 9640400073
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217
■ కావలెను.VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోడానికి స్త్రీ/పురుషులు, ఆయా, నర్సులు,వంటచేయువారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15000- 40000, ఫ్రీ రూమ్ + భోజనం. HYD. ఫోన్: 7995385899
■ JOB VACANCY: MAX PVT. LTD. Age: 18 to 45 yrs, Q:10th to Any Degree, Sal:18000/- to 25000/- (Work from available) ✆7032931474

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశిదంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

21 మంది రౌడీషీటర్లకు తాఖీదులు

– 32 మంది గృహ నిర్బంధం

కడప అర్బన్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ రోజున కట్టుదిట్టమైన భద్రత నిర్వహించనున్నారు. నగర శివార్లలో మౌలానా అజాద్ ఉర్దూ యూనివర్సిటీ(మను)లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్ వద్ద ప్రశాంత వాతావరణంలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ వి.విజయరామరాజు పర్యవేక్షణలో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు 21 మంది రౌడీషీటర్లకు జిల్లా బహిష్కరణ నోటీసులు జారీ చేశారు. వీరంతా శనివారం సాయంత్రం నుంచి జూన్ 7వ తేదీ వరకు జిల్లాలోకి అడుగుపెట్టకూడదని ఆదేశించారు. వారితో పాటు 32 మందికి గృహ నిర్బంధం నోటీసులు జారీ చేశారు. ఇప్పటి వరకు పోలీసుశాఖ 1038 మందిని రౌడీషీటర్లను గుర్తించింది. వారిలో 2014, 2019, 2024 ఎన్నికల సందర్భంగా అల్లర్లకు, గొడవలకు కారణమైన 21 మందికి జిల్లా బహిష్కరణ నోటీసులు జారీ చేశారు. ఇంకా బహిష్కరణ నోటీసుల సంఖ్య 130 మందికి చేరనుంది. 1038 మంది రౌడీషీటర్లలో సత్ప్రవర్తన కలిగిన 652 మందిని ముందస్తుగా అరెస్టు చేయనున్నారు. ఈ నోటీసులను ఇప్పటికే ఆయా రెవెన్యూ సబ్ డివిజన్ పరిధిలోని రెవెన్యూ, పోలీసు అధికారుల చేతుల మీదుగా ఉత్తర్వులు జారీ చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల రోజు నుంచి జరిగిన ఘర్షణలలో 40 మందిపై రౌడీషీట్ తెరిచారు. సార్వత్రిక ఎన్నికలు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 18632 మందిని బైండోవర్ చేశారు.

యథేచ్ఛగా కలప రవాణా



లారీలో అక్రమంగా తరలిస్తున్న వేప, మామిడి కలప

వీరబల్లి : వీరబల్లి మండలం గుర్రప్పగారిపల్లి పంచాయతీ నుంచి కలప అక్రమంగా తరలిపోతోంది. అటవీ అధికారులు చూసీ చూడనట్లు ఉండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. శుక్రవారం గుర్రప్పగారిపల్లి పంచాయతీ నుంచి ఇలా మామిడి, వేప కలపను లారీలలో తరలిస్తున్నారు. చెక్‌పోస్టు వద్ద అధికారులతో జతకలిసి అక్రమార్కులు ఈ కలప అక్రమంగా తరలించేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఇసుక టిప్పర్ స్వాధీనం



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

లక్కిరెడ్డిపల్లి : తక్కెడపల్లె ఎక్సైజ్ పరిధిలోని గాలివీడు మండలం గరుగుపల్లె ఏరు నుంచి నూలివీడుకు ఇసుక తరలిస్తుండగా శుక్రవారం టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న టిప్పర్, ఇసుకను గాలివీడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించామన్నారు. వంకలు, చెరువు ప్రాంతాలలో నిఘాపెట్టి అక్రమ ఇసుక రవాణాను అరికడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మోహన్‌రెడ్డి, నాగరాజు, ఈసీ నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా జాతర

సుండుపల్లె: మండల కేంద్రంలోని గంగిరెడ్డిగారిపల్లెలో అమ్మవారి జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఉదయం మూలమూర్తికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం రాత్రికి చాందినీ బండ్ల ఊరేగింపు ఉంటుందన్నారు.

ఆధిపత్య పోరుతోనే శేషాద్రి హత్య

- డీఎస్పీ ప్రసాదరెడ్డి
- ఏడుగురు నిందితుల అరెస్ట్ చూపిన పోలీసులు
- మారణాయుధాలు, ఇన్నోవా, ఆటో, టూవీలర్ సీజ్





శేషాద్రి హత్య కేసు నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి, హత్యకు వాడిన ఆయుధాలు

మదనపల్లె : పట్టణంలో సంచలనం సృష్టించిన పుంగనూరు శేషాద్రి హత్య కేసు మిస్టరీ వీడింది. ఆధిపత్య పోరులో భాగంగానే శేషాద్రిని అంతమొందించినట్లు పోలీసులు నిర్ధారించారు. స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన పుంగనూరు శేషాద్రి ఈ నెల 24న హత్యకు గురికాగా, సీఐలు యువరాజు, వలిభాషా, ఎస్ఐలు వెంకటసుబ్బయ్య, ఇనయతుల్లా, తాలూకా ఎస్ఐ వెంకటేష్‌లతో కలిపి నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. స్థానిక అన్నమయ్య సర్కిల్ వద్ద నిందితులు పారిపోయేందుకు ఉపయోగించిన ఇన్నోవా వాహనంతోపాటు, హత్య సమయంలో వినియోగించిన ఆటో, టూవీలర్, ఏడు కత్తులు, సమ్మెట స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల నుంచి హత్యకు కారణాలు తెలుసుకున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. వారికి ఇన్నోవా వాహనాన్ని సమకూర్చిన ముద్ర, హరిలను కేసులో ముద్దాయిలుగా చేర్చామన్నారు. కేసు ఛేదించిన సీఐ, ఎస్ఐ, ఇతరులను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

పక్కా ప్రణాళికతో... హత్య

పట్టణంలోని రామారావుకాలనీకి చెందిన పుంగనూరు శేషాద్రి, గొల్లపల్లెకు చెందిన కొండుపల్లె ఆనంద్ ఓ ప్రజాసంఘంలో సభ్యులుగా ఉంటూ భూదందాలు, వివాదాల పరిష్కారం చేసేవారు. ఇటీవల ఇరువురి మధ్య మనస్పర్థలు వచ్చి విభేదాలు పెరగడంతో శేషాద్రి, కొండుపల్లె ఆనంద్ నుంచి విడిపోయాడు. బహుజన భీమ్‌సేన పేరుతో ప్రజాసంఘాన్ని స్థాపించి సొంతంగా సెటిల్‌మెంట్ చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలోనే కొండుపల్లె ఆనంద్, శేషాద్రి స్నేహితుడైన నాగరాజుపై దాడి చేశారు. దీంతో ఆనంద్‌కు ఫోన్‌లో వార్నింగ్ ఇవ్వడంతోపాటు చంపేస్తానని శేషాద్రి బెదిరించాడు. దీంతో ఆగ్రహానికి గురైన ఆనంద్(40) ఈ నెల 24న రాత్రి 12 గంటలకు తన అనుచరులైన తుపాకుల మణికంఠ(23), బండి మహేష్(28), సాలిపడి రాజశేఖర్(40), మొరంపల్లె చరణ్‌కుమార్(23), ముసిలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అలియాస్ చెన్నారెడ్డి(28), పఠాన్ నజీర్‌ఖాన్(27)తో కలిసి శేషాద్రిని హత్యచేసేందుకు కుట్ర చ ఏశారు. అతడు నివాసం ఉంటున్న మంజునాథకాలనీకి ఆటో, టూవీలర్‌లో వెళ్లి జనసంచారం లేకపోవడంతో, గేటు తీసి లోపలికి వెళ్లారు. ఇంట్లో నిద్రిస్తున్న శేషాద్రి, అతడి భార్య కమల బాత్ రూమ్‌లోకి వెళ్లి గడియపెట్టుకోగా.. తలుపులు పగలగొట్టి శేషాద్రిని మిద్దెపైకి తీసుకెళ్లారు. అక్కడ మాటామాటా పెరగడంతో ఆనంద్ కత్తితో తలపైన నరికారు. ప్రాణభయంతో శేషాద్రి తప్పించుకుని ఇంట్లోకి వెళ్లగా అతడిని బయటికి ఈడ్చుకువచ్చారు. తన భర్తను చంపవద్దని భార్య ప్రాధేయపడినా వినకుండా విచక్షణారహితంగా కసితీరా నరికి చంపేశారు.

దేవాదాయ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు బి. నారాయణ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అర్హత లేని సభ్యులకు కడప ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ, ఇతర దేవాదాయ శాఖ అధికారులు సహకరించడంపై విచారించి చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు బి.నారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల కిందట యాదాళ పిచ్చయ్య ట్రస్టు స్థలాన్ని కొందరు కబ్జా చేయగా, ఆ స్థలాన్ని ట్రస్టు సభ్యుల కోరిక మేరకు కాపాడామన్నారు. ఇందుకు నాడే ట్రస్టు సభ్యులు సీపీఎం కార్యాలయానికి 20 సెట్ల స్థలం కేటాయించారన్నారు. ఇపుడు ట్రస్టు స్థలం దేవాదాయ శాఖ ఆధీనంలోకి వెళ్లడంతో కొందరు వ్యక్తులు కూర్చుని నిబంధనలు తయారుచేశారన్నారు. వాస్తవాలను పక్కనపెట్టి చట్ట విరుద్ధంగా కొందరు నాయకులను అక్రమ పద్ధతిలో ట్రస్టు సభ్యులుగా చేర్చడంతో నకిలీ పత్రాలు సృష్టించారన్నారు. దేవాదాయశాఖ అధికారులతో కలిసి రికార్డులు తారుమారు చేసి ట్రస్టు స్థలం విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. దేవాదాయ శాఖ అధికారుల చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు సంబంధించిన వీడియోలను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఐ.ఎన్.సుబ్బమ్మ, బి.మనోహర్, ఎ.రామ్మోహన్, కే.శ్రీనివాస్ రెడ్డి, దస్తగిరి రెడ్డి, వి.అన్వేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్న అత్తింటివారిపై బాధితురాలు రేవతి ఫిర్యాదు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. మదనపల్లి పట్టణం ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఆనంద్‌నాయుడు కుమార్తె సి.రేవతిని సుండుపల్లె మండలం చప్పిడివాండ్లపల్లెకు చెందిన చంద్రయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు సి.రమేష్‌తో 14ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారుల సంతానం. వివాహ సమయంలో 300 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20 లక్షలు కట్నంగా ఇచ్చారు. ఇటీవల అనారోగ్య కారణాలతో రమేష్ సైనిక ఉద్యోగం నుంచి విరమణ చెంది స్వగ్రామం వచ్చేశాడు. నూతన ఇంటి నిర్మాణం చేపట్టేందుకు కోటి రూపాయలు తేవాలని ఆయన కోరినట్లు భార్య రేవతి తెలిపారు. అందుకు ఒప్పుకోకపోవడంతో రమేష్, తన తల్లిదండ్రులతో కలిసి వేధిస్తున్నారని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. శుక్రవారం పుట్టింటికి వచ్చిన రేవతి స్థానిక టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త రమేష్ అత్త లక్ష్మీదేవి, మామ చంద్రయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఇనయతుల్లా దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.